క్లుప్తంగా

కొండలమ్మను దర్శించుకున్న జడ్జి



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.ఆర్. కృష్ణయ్య శనివారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ చైర్మన్ శేషం గోపి దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత జడ్జి పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహం



అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామంలోని జెడ్పీహైస్కూల్‌లో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని మిక్కిలి చరిష్మాకు అభినందన ట్రస్టు ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకంతో పాటు రోలింగ్‌షీల్డును శనివారం బహూకరించారు. పెదమద్దాలి గ్రామానికి చెందిన అభినందన ట్రస్టు అధ్యక్షుడు డొక్కు సుబ్రమణ్యం మాట్లాడుతూ ట్రస్టు ద్వారా అనేక మంది పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా ఇవ్వడం జరుగుతోందని అన్నారు. చరిష్మా మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నందుకు రూ.2,116 నగదు ప్రోత్సాహకంతో పాటు రోలింగ్‌షీల్డును అందజేశారు. అనంతరం ద్వితీయస్థానం సాధించిన జ్యోత్సను కూడా సత్కరించారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం డి.పద్మ, కార్యక్రమ కో ఆర్డినేటర్ కట్టా శ్రీనివాసరావు, సామాజిక సేవాకార్యకర్త యర్రంశెట్టి సావిత్రమ్మ, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు జోజిబాబు, అశోక్, మిక్కిలి నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగుహక్కు పత్రాల పంపిణీ




గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను కౌలు రైతులకు కూడా అందించేందుకు సాగు హక్కు పత్రాలు ఉపయోగపడతాయని ఏవో బి.అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని బొమ్ములూరు రైతుభరోసా కేంద్రంలో శనివారం కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ హక్కు పత్రాలు పొందటం వలన ప్రభుత్వం ఇచ్చే ప్రతి రాయితీని కౌలురైతులు రైతులతో పాటు సమానంగా పొందవచ్చని సూచించారు. విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ టి.సాయిమౌనిక, కౌలు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ సేకరణ



మండవల్లి: మండలంలోని లింగాల కాంప్లెక్స్ పరిధిలోని కొర్లపాడు ప్రాథమిక పాఠశాలలో శనివారం సీఆర్పీ టి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుకలు అందజేశారు. విద్యార్థులకు అన్నీ సక్రమంగా అందినట్లు విద్యార్థులతో బయోమెట్రిక్ తీసుకుని సంబంధిత వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్టు సీఆర్పీ పేర్కొన్నారు. దీని ద్వారా జగనన్న విద్యాకానుకలోని అన్ని వస్తువులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్టు సీఆర్పీ తెలిపారు.

పేద మహిళలకు దుస్తుల పంపిణీ



గుడ్లవల్లేరు: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు దుస్తులను శనివారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ ఆధ్వర్యంలో ముఖ్య అతిథి ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మహంకాళి మురళీధర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు రమేష్ బాబు, జగదీష్, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, మోహన్‌బాబు, కుటుంబరావు, సుదర్శన్, కామేశ్వరీ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

అపర భగీరథుడు సీఎం జగన్

ఎమ్మెల్యే డీఎన్నార్



కలిదిండి మండలం కోరుకొల్లు లాకుల వద్ద దిగువకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాష్ట్రంలో రైతుల పాలిట అపర భగీరథుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. జలహారతి కార్యక్రమాల్లో భాగంగా శనివారం కైకలూరు మండలం వింజరం, కలిదిండి మండలం కోరుకొల్లు లాకుల నుంచి పంట కాలువలకు నీటిని శనివారం విడుదల చేశారు. నాయకులు, అధికారులు నీటిలో పుసుపు, కుంకుమ, పూలు చల్లి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కృష్ణా డెల్టా శివారు నియోజకవర్గం కైకలూరుకు నీటి పంపిణీలో అన్యాయం జరిగేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వరుణుడి కరుణతో పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. సకాలంలో నీటిని విడుదల చేయడం వల్ల వరి, ఆక్వా రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. నీటి పంపిణీ విషయంలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, కలిదిండి ఏఎంసీ చైర్మన్ బనాల బ్రహ్మాజీ, వింజరం సర్పంచ్ ధర్మరాజుల నాగమణి, కైకలూరు మండల వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, కైకలూరు, కలిదిండి మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, తిరుమాని రమేష్, సర్పంచ్‌లు ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, గెద్ద ఆనందకుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చన్నంశెట్టి కోదండయ్యరామయ్య, కోరుకొల్లు ఉప సర్పంచ్ చన్నంశెట్టి నాగరాజు, కలిదిండి ఏఎంసీ వైస్ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పట్టపు బాలమ్మ, ధర్మరాజుల సూర్యనారాయణ, ఇరిగేషన్ డీఈ గణేష్ బాబు, ఏఈఈలు కిషోర్, సిద్ధార్థ్, రాజగోపాల్, రైతులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

కైకలూరు: గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్య మిస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కైకలూరు–1 సచివాలయం పరిధి వెలమపేట 19, 20 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిమిత్తం కేటాయించిన రూ.20 లక్షల నిధులతో 9 సీసీ రోడ్ల నిర్మాణాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మమహ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, మండలం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, తోట మహేష్, మూడేడ్ల గౌరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ సర్టిఫికెట్లు అందజేత



ఇంటింటికీ ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

గుడ్లవల్లేరు: జగనన్న సురక్షతో ప్రజలకు మేలు చేకూరుతుందని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. శనివారం గుడ్లవల్లేరులో ఇంటింటికీ వెళ్లి వివిధ రకాలధ్రువీకరణపత్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు.ఈ క్యాంప్‌లో ప్రజలకు 11రకాల ధ్రువపత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టను గుడ్లవల్లేరు–1 సచివాలయ పరిధిలో నిర్వహించినట్లు తెలిపారు. తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్,డీటీ బి.కనకదుర్గ, కార్యదర్శి నరసింహారావు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

మండవల్లి: మండలంలోని కొవ్వాడలంక గ్రామ పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.14 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు సర్పంచ్ జయమంగళ తిరుపతి వెంకన్న పర్యవేక్షణలో జరుగుతున్నట్లు కార్యదర్శి పి.రత్నకుమారి పేర్కొన్నారు.

అనధికార లే-అవుట్‌పై విచారణ

పమిడిముక్కల: మంటాడలోని అనధికార లే-అవుట్ యజమానిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ పి.రాజబాబు ఆదేశాల మేరకు గుడివాడ డీఎల్‌పీఓ సంపత్ కుమారి శనివారం మంటాడ గ్రామ పంచాయతీలో లే-అవుట్‌పై విచారణ నిర్వహించారు. సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల అనుమతి లేకుండా లే అవుట్ వేసి విక్రయాలు జరిపిన యజమాని వెంకటేశ్వరరావుపై చర్య తీసుకోవాలని, అనధికార లే అవుట్‌లోని తన రహదారిపై జగనన్న కాలనీ లబ్ధిదారులు మినహా ఎవరూ నడవకూడదని తహసీల్దార్‌కు అఫిడవిట్ సమర్పించిన లే-అవుట్ యజమానిపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు సంపత్‌కుమారి తెలిపారు.

రచయితలు సామాజిక చైతన్యానికి పునాదులు

ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు గోళ్ల నారాయణరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న గోళ్ల నారాయణరావు

చినముత్తేవి(మొవ్వ): మండలంలోని చినముత్తేవిలో కామ్రేడ్ జీఆర్‌కే–పోలవరపు సాంస్కృతిక సమితి నిర్వాహణలో రెండు రోజుల పాటు జరిగే కథాకార్యశాల–2023 కార్యక్రమాలు శనివారం ప్రారంభించారు. సమన్విత అధ్యక్షురాలు, కథా కార్యశాల కన్వీనర్ డాక్టర్ దుట్టా శమంతకమణి స్వాగతం పలికిన ఈ సభకు కార్యదర్శి శాంతిశ్రీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ రచయితలు తమ అక్షరాలతో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నారన్నారు. చరిత్రను శాశ్వతంగా తమ అక్షరాలతో భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రచయితలు కూడా ఉత్తమ విలువలతో కూడిన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యశాల ప్రధానాచార్యులు వరప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, వేంపల్లి షరీఫ్, ప్రముఖ రచయితలు ఖదీర్ బాబు, కే ఉషారాణి, రావెళ్ల లక్ష్మి, డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి విమల మృతి

పమిడిముక్కల: మండలంలోని మంటాడ గ్రామ మాజీ సర్పంచి యడ్ల విమల (65) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సర్పంచిగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు. విమలకు ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కై లే జ్ఞానమణి శనివారం మంటాడలో విమల మృతదేహాన్ని సందర్శించారు. నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేరుగ లక్ష్మి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు షణ్ముఖరావు, శ్రీనివాసులు

కైకలూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జి.షణ్ముఖరావు చెప్పారు. ఆటపాక పంచాయతీ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మహిళా చట్టాలపై జడ్జి షణ్ముఖరావు వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వడ్లాని శ్రీరామచంద్రమూర్తి. న్యాయవాదులు బందెల లక్ష్మణరావు, తేరా విజయ్‌కుమార్, పవన్‌కాంత్, శివప్రసాద్, రమాదేవి, సీహెచ్.శంకశాస్త్రి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన



పెదపారుపూడి: స్థానిక ప్రధాన సెంటర్‌ల్లో ఉన్న ఎస్‌ఐ నాగకళ్యాణి ఆధ్వర్యంలో దిశ యాప్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ దిశ యాప్ మీ చెంత ఉంటే మీకు రక్షణగా మీతో పోలీసు ఉన్నట్లేనన్నారు. ప్రతి మొబైల్‌లో ఖచ్చితంగా దిశ యాప్ ఉంటే మంచిదన్నారు. దిశ యాప్ ఉంటే సమాచారం అందించిన క్షణాల్లో పోలీసులు వచ్చి రక్షణ ఇస్తారన్నారు. సుమారు 150 మంది మొబైల్‌లలో దిశ యాప్‌ను డౌన్ లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ మహిళ పోలీసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి

తీరిన 10వ వార్డు ప్రజల సమస్య



రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకుడు ఆలీబేగ్

గుడివాడరూరల్: పట్టణంలోని 10వ వార్డు అల్యూమినియం ఫ్యాక్టరీ పక్కనున్న కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, రూ.2 లక్షలతో డ్రెయినేజీలను మున్సిపాలిటీ నిధులతో నిర్మించారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చొరవతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రోడ్డు నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు శరవేగంగా పూర్తి చేశారు. గతంలో 10వ వార్డులో ఉన్న అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజల అవసరాలకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్ల కాలనీవాసులు ముబారక్ సెంటర్ నుంచి ఎర్రబడ్డీ వైపు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ దృష్టికి తీసుకెళ్లడంతో అయన ఎమ్మెల్యే కొడాలి నానికి వివరించారు. దీంతో 250 మీటర్ల పొడవు గల రోడ్డును సీసీరోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణం శరవేగంగా పూర్తి కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం వలన 10వ వార్డుతో పాటు 11వ వార్డులో ఉన్న ప్రజలు నేరుగా బంటుమిల్లిరోడ్‌కు చేరుకుని పట్టణంలోకి వెళ్లేందుకు మార్గం సులువైంది. ఈ విషయంలో ఎమ్మెల్యే కొడాలి నాని, దుక్కిపాటి శశిలకు వార్డుల ప్రజలు రుణపడి ఉంటారని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సంఘ నాయకుడు ఆలీబేగ్ తెలిపారు.

27 నుంచి ఉచిత శిక్షణ

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

కురుమద్దాలి(పామర్రు): నిరుద్యోగ యువతకు శిక్షణతోపాటు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. మండలంలోని కురుమద్దాలిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కురుమద్దాలి గ్రామంలోని రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, మహిళలకు టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు ఉచిత శిక్షణ తరగతులు మొదలు అవుతాయని తెలిపారు. ఈ స్కిల్ హబ్‌లో అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్స్‌కు 10 వతరగతి, ఆపైన చదివిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్స్ జిరాక్సు కాపీలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 80743 70846 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న ఎంపీపీ

గుడివాడరూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేద కూలీలకు వరం లాంటిదని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 2022–23 ఏడాదికి ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను సోషల్ ఆడిట్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4.8 కోట్ల పనులను నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి ఏపీవో జి.రామకృష్ణ సమావేశంలో తెలిపారు. గ్రామాల వారీగా తనిఖీ సిబ్బంది జిల్లా నుంచి వచ్చిన ఆడిట్ అధికారులకు సమాచారాన్ని వివరించారు. వివిధ పనులకు సంబంధించి సక్రమంగా పని చేయని ఫీల్డ్ అసిస్టెంట్ల దగ్గర నుంచి అపరాధ రుసుము రూ.33,600 అధికారులు వసూలు చేశారు. ఎంపీడీవో వెంకటరమణ, ఏపీడీ నాంచారయ్య, డ్వామా ఏవో నాగమల్లేశ్వరరావు, ఏపీడీ గుడివాడ క్లస్టర్ శ్రీలత, ఏపీపీ (గుడివాడ) లక్ష్మీరెడ్డి, సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పీ చిన్నబ్బాయి, టెక్నికల్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి నారుమళ్లు కళకళ



పామర్రు: ప్రస్తుత వాతావరణంలో మార్పులకు అనుగుణంగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని వరి నారుమళ్లు కళ కళ లాడుతున్నాయి. వాతావరణ ప్రభావంతో గత రెండు రోజుల నుంచి జాలుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని కురుమద్దాలి, బల్లిపర్రు, కనుమూరు తదితర గ్రామాల్లో పోసిన వరి నారుమళ్లు ఏపుగా పచ్చగా పెరుగుతున్నాయి. తొలకరి చినుకులతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి పాగు పనులలో రైతులు బిజీబిజీగాఉంటున్నారు. మండల పరిధిలో 23 వేల ఎకరాల్లో వరి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి

పామర్రు ఎంపీపీ అశోక్‌కుమార్



నిమ్మకూరులో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

నిమ్మకూరు(పామర్రు): జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు సచివాలయం వద్ద పలు గ్రామాల్లో కై లు రైతులకు జగనన్న సురక్ష ద్వారా కౌలు గుర్తింపు కార్డులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కింత ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతోందని అన్నారు. సచివాలయ పరిధిలోని నిమ్మకూరు, నిభానుపూడి, అవురుపూడి గ్రామాల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ఏవో శివనాగరాణి, వీఆర్వో రామారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు, గ్రామ సర్పంచ్ శ్రీను, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు పోలవరపు శ్రీను, జైరాం, అంకినీడు, కోటయ్య, శ్రీను, శంకర్ లు పాల్గొన్నారు. అడ్డాడలో గ్రామంలోని సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. పలువురుకి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పి.త్రినేత్రి, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, కార్యదర్శి సుబ్రమణ్యేశ్వర శాస్త్రి, స్థానికులు పీ వెంకట్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎంపీపీ పెయ్యల ఆదాం



నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

నందివాడ(గుడివాడరూరల్): గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద విద్యార్థుల చదువును ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సకల సదుపాయాలను కల్పిస్తుందని ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు. నందివాడ జెడ్పీ పాఠశాలలో జూనియర్ కళాశాల తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎంపీపీ శనివారం ప్రారంభించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరిన 15 మంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 7గురు అధ్యాపకులతో ప్రారంభమైన కళాశాల దినదినాభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఉన్నత విద్య విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మండలస్థాయిలో కళాశాలను ఏర్పాటు చేయడం ఆనందాయకమన్నారు. విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు లేకుండా మండల కేంద్రాల్లోనే కళాశాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాలలో చేరిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈవో డేవిడ్‌రాజు, వలివర్తిపాడు యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కందుల నాగరాజు, హెచ్‌ఎం రవికుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సరుకుల వితరణ



కలిదిండిలో పేదలకు దుస్తులు పంపిణీ

కైకలూరు(కలిదిండి): వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాన్ టు డస్క్‌ ‘పేరుతో సేవా కార్యక్రమాలను వాసవీ క్లబ్ వనిత కలిదిండి గోల్డ్ ఆధ్వర్యంలో మాధవి నిలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మహంకాళి మురళీధర్ చేతుల మీదుగా కలిదిండి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సిమెంట్ బెంచ్, రైతు బొడ్డు రవికి ఎరువుల కట్ట, స్ప్రే మిషన్, భారత సైన్యంలో పనిచేసిన చెరుకూరి ఏలీయాకు సన్మానం, పది మంది పేద మహిళలకి చీరలు, దుప్పట్లు, పేద ఆర్య వైశ్య కుటుంబానికి నిత్యావసరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు నీలి మాధవి, క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ చారుగుండ్ల రమేష్ బాబు, కొనకళ్ల జగదీష్, రిజియన్ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, రిజియన్ సెక్రటరీ బచ్చు సుదర్శన్, జోన్ చైర్మన్ బచ్చు మురళీకృష్ణ, క్లబ్ సెక్రటరీ సొలస వసంత లక్ష్మీ, కోశాధికారి మానేపల్లి పద్మావతి, పూర సత్యవతి, బూర్లే కీర్తి, భూమా లక్ష్మీ, కారుమూరి లక్ష్మీ, పచ్చిగోళ్ళ మహాలక్ష్మీ, మండా శిరీష, పెరుమాళ్ల లక్ష్మి, సనిశెట్టి సుధారాణి, చక్కా జగన్, గొంద్రాల సుబ్బయ్య తదితర సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

తహసీల్దార్లు



మాట్లాడుతున్న తహసీల్దార్ భావన్నారాయణ

నందివాడ(గుడివాడరూరల్): అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని తహసీల్దార్ భావన్నారాయణ అన్నారు. మండలంలోని జనార్థనపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు 11 రకాల సేవలను ప్రజల ఇంటికే వెళ్లి ఇచ్చే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వారినే అడిగి తెలుసుకుని అందజేయాలన్నారు. సర్పంచ్ దారా మరియమ్మ, వైస్ ఎంపీపీ కొప్పుల జయరాజు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొండపల్లి కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్డీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వెంట్రప్రగడ(పెదపారుపూడి): వెంట్రప్రగడ–1 సచివాలయం వద్ద జగనన్న సురక్ష పై వలంటీర్లకు తహసీల్దార్ వి.నాగభూషణం శనివారం అవగహన సమావేశం నిర్వహించారు. ప్రతి వలంటీర్ 50 ఇళ్లకు వెళ్లి ఏటు వంటి సేవలు కావాల్లో ముందుగానే గుర్తించాలన్నారు. సేవలకు ఏఏ పత్రాల్లో కావాల్లో తెలియజేసే ఫారం అందించాలన్నారు. జగనన్న యాప్ ఓపెన్ అవ్వగానే గుర్తించి సేవలకు టోకెన్ ఇవ్వలన్నారు. మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ రమణారావు, చీకుర్తి వరప్రసాద్, మండవ జానకరామయ్య (మున్నా) వీఆర్వోలు చాట్ల అజయ్‌కుమార్, వెంకట్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.